సాక్షి
ములుగు
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి

కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైల్వే సీఈఎల్ఈ బీపీఎస్.రాథోర్ అన్నారు. - 8లో▸



ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4^0 / 25.3^0

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పులి జాడకోసం గాలింపు



ములుగు రూరల్: పత్తిపల్లి శివారులో పత్తిచేనులో పులి అడుగులను అటవీశాఖ అధికారులు బుధవారం గుర్తించిన విషయం విధితమే. ఈ మేరకు గురువారం అటవీశాఖ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో సిబ్బంది పత్తిపల్లి శివారు ప్రాంతాల్లో పులి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. పత్తిపల్లి, పొట్లాపూర్, అటవీప్రాంతాలు, ఎడ్లచెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో డోలి శంకర్ మాట్లాడుతూ పంట చేనులో నుంచి కొంత దూరం మాత్రమే పులి పాదముద్రలు కనిపించాయని తెలిపారు. పత్తిపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పులికి ఎలాంటి హాని తలపెట్టకూడదని తెలిపారు. హాని తలపెడితే జంతు పరిరక్షణ చట్టం ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. పశువులపై పులి దాడి చేస్తే అటవీశాఖ ఆధ్వర్యంలో పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపిక

ములుగు రూరల్: ఈ నెల 9, 10వ తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆల్ ఇండియా టోర్నమెంట్స్‌లో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ సెలక్షన్స్ 2025–26 పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఉద్యోగులు పాల్గొనాలని జిల్లా యువజన క్రీడల అధికారి సర్ధార్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన మండలంలోని జాకారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, క్రికెట్, చెస్, క్యారమ్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా, ఖో–ఖో క్రీడల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళా, పురుషులు పర్మనెంట్ ఉద్యోగులు మాత్రమే సర్వీస్ సర్టిఫికెట్ లేదా ఇటీవల తీసిన ఐడీ కార్డుతో 10గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: ఏటూరునాగారంలోని గిరిజన సంక్షేమశాఖ క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 8, 9వ తేదీలలో దేహదారుఢ్య నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ హరిసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, నాలుగు కలర్ పాస్ ఫొటోలు తీసుకుని టీజీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ బాయ్స్ స్కూల్ ఏటూరునాగారంలో ఉదయం 8 గంటలకు హాజరుకావాలని తెలిపారు. అర్హత 4వ తరగతి ఉత్తీర్ణులై 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌కు చెందిన వారు హాజరు కావాలని వివరించారు. సీట్లు రోస్టర్ విధానంలో కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఎస్టీ 58, ఎస్సీ 5, బీసీ 5, ఓసీ 5, మైనార్టీ 5, గురుకుల ఉద్యోగులకు 1, స్పోర్ట్స్ కోటాలో 1 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9441619409, 9449448157లలో సంప్రదించాలని కోరారు.

పేదలకు ఉపశమనం


ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన నిర్ణయాలతో పాలు, పెరుగు, పిండి, పప్పులు, నిత్యావసర వస్తువులపై, చిరువ్యాపారులకు జీఎస్టీ తగ్గింపు లేదా పూర్తిస్థాయి మినహాయింపు లభిస్తుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతుందని వివరించారు. వ్యవసాయ రంగానికి, వ్యవసాయ యాంత్రీకరణ వస్తువులపై 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ పట్ల వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మధుసూదన్ తెలిపారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై జిల్లాకేంద్రంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్ఓ ల్యాబ్ టెక్నీషన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మధుసూదన్ మాట్లాడారు. తమ ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన మలేరియా, డెంగీ వ్యాధులను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

గురువుస్థానం వెలకట్టలేనిది..

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



సమాజంలో గురువు స్థానం వెలకట్టలేనిది..విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించి ఉత్తములుగా తీర్చిదిద్దుతాడు. వారి కలలను నిజం చేసే మార్గనిర్దేశకుడు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన బోధన చేసిన పలువురి ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..

బడికి రాకుంటే ఊరుకునేదే లేదు..



పిల్లలను బడికి తీసుకెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్

ఏటూరునాగారం: మండల పరిధిలోని నార్త్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పోతు రాజశేఖర్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలకు విద్యార్థులు డుమ్మా కొడితే ఊరుకునేదే లేదు.. ఎట్లాగైనా బడికి తీసుకురావాలే.. అనే సంకల్పంతో ఇంటింటికి తిరిగి పిల్లలను బడికి తీసుకొస్తాడు. ఈ ఏడాది 25 మంది విద్యార్థులను కొత్తగా అడ్మిషన్ చేయించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైతం ఈ పాఠశాలలో చేరే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాడు. అంతేకాకుండా అందులో 16 మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఉండడం గమనార్హం. ఇంగ్లిష్ మీడియంలో పాఠాలను బోధిస్తూ ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నాడు.

ఆదర్శం యాదలక్ష్మి



విద్యార్థులతో ఉపాధ్యాయురాలు యాదలక్ష్మి

గోవిందరావుపేట: మండల పరిధిలోని గాంధీనగర్ యూపీఎస్ పాఠశాలలో యాదలక్ష్మి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మూడేళ్లగా పాఠశాలలో విద్యార్థులు లేని పరిస్థితి ఉంది. దీంతో పాఠశాలలో ఆమె ఉపాధ్యాయురాలిగా అడుగుపెట్టినప్పటి నుంచి పెను మార్పులు తీసుకొచ్చారు. తన సొంత ఖర్చులతో భవనానికి పెయింటింగ్ వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. పిల్లల ఇంటింటికీ తిరిగారు. తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఈ ఏడాది ఆరుగురు విద్యార్థులను బడిలో చేర్పించారు. వారికి షూస్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందజేసి వినూత్న రీతిలో బోధిస్తూ ఆదర్శంగా నిలిస్తోంది.

- మరిన్ని కథనాలు 8లో▸

నిమజ్జనానికి వేళాయె..



ఏటూరునాగారం: ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



ములుగు తోపుకుంట వద్ద నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లు

నేడు వినాయక నిమజ్జనం

- చెరువులు, వాగుల వద్ద ఏర్పాట్లు
- జిల్లాలో 800కు పైగా గణపతి విగ్రహాలు
- 400 మంది పోలీసులతో బందోబస్తు
- రామప్ప, లక్నవరం చెరువుల్లో అనుమతి నిరాకరణ

ములుగు: నవరాత్రులు పూజలందుకున్న వినాయకుడికి నేడు ప్రజలు వీడ్కోలు పలకనున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పోలీసు అధికారులు సంయుక్తంగా కలిసి వినాయక నిమజ్జనానికి పూర్తి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి నిమజ్జన కార్యక్రమాలు మొదలుకానున్నాయి. భక్తులు చెరువుల్లోకి దిగకుండా ప్రధాన చెరువుల వద్ద గ్రామ పంచాయతీ, పోలీస్ అధికారులు క్రేన్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ దివాకర, డీపీఓ దేవరాజ్ ఆదేశాలు జారీ చేయడంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చెరువులు, కుంటల వద్ద ఏర్పాట్లను పూర్తి చేశారు.

రామప్ప, లక్నవరం సరస్సుల్లో అనుమతి లేదు..

వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప, గోవిందరావుపేట మండల పరిధిలోని లక్నవరం జలాశయం వంటి ప్రధాన చెరువుల్లో వినాయక నిమజ్జనానికి పోలీసు శాఖ అనుమతులు నిరాకరించింది. నిమజ్జనం సమయంలో యువకులు సరస్సుల్లో దిగి మృత్యువాత పడతారనే నెపంతో నిమజ్జనం చేసేందుకు అనుమతులు ఇవ్వలేదు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాలను ఆయా మండలాలకు చెందిన పోలీసు అధికారులు గురువారం పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బ్రిడ్జి వద్ద క్లినింగ్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమాదేవి



నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భారీ బందోబస్తు

జిల్లాలో శుక్రవారం జరిగే వినాయక నిమజ్జనానికి సంబంధించి 400 మంది సివిల్, ఏఆర్, టీఎస్‌పీఎస్, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లాలో 800కు పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు ధృవీకరించారు. నిమజ్జన ప్రక్రియ మొదలు నుంచి పూర్తి అయ్యేంత వరకు పూర్తి కార్యక్రమాన్ని పోలీసు ఉన్నతాధికారులతో పాటు ఇంటెలిజెన్స్, ఎస్‌బీ ఫీల్డ్ అధికారులు పరిశీలించనున్నారు. ములుగు సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్, ఏటూరునాగారం సబ్ డివిజన్ ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలనలో నిమజ్జన కార్యక్రమం కొనసాగనుంది.

నిమజ్జనం చేసే ప్రాంతాలివే..

జిల్లాలో ప్రధానంగా ములుగు గ్రామ పంచాయతీ పరిధిలోని తోపుకుంట, మల్లంపల్లి మండలంలో ఊర చెరువు, వెంకటాపురం (ఎం) మండలంలో నల్లకాలువ, గోవిందరావుపేట మండలంలోని గౌరారం చెరువు, రంగాపూర్ కాల్వ, ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో జంపన్నవాగు, కన్నాయిగూడెం మండలంలో తుపాకుల గూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ, వెంకటాపురం(కె) మండలంలో పాలెం వాగు వద్ద, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు మండలాలకు చెందిన వారు ఏటూరునాగారం ముళ్లకట్ట పూసూరు బ్రిడ్జి వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జనానికి క్రేన్లు, జేసీబీలను వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నిమజ్జనం ప్రాంతంలో లైటింగ్ ఏర్పాటు, విద్యుత్‌కు అంతరాయం కలిగితే జనరేటర్లను సైతం వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి



వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. జిల్లా వ్యాప్తంగా రహదారులు, నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. శోభాయాత్ర భక్తిభావంతో శాంతియుతంగా సాగేలా ఉత్సవ కమిటీ సభ్యులు చూసుకోవాలి. గ్రామాలలో ప్రజల సంరక్షణకు స్థానిక పోలీసు బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయి. నిమజ్జనం సమయంలో స్థానిక పోలీసులకు ప్రజలు సహకరించాలి.

- డాక్టర్ శబరీశ్, ఎస్పీ

యూరియా కోసం పడిగాపులు



చిన్నబోయినపల్లి పీఏసీఎస్ వద్ద పోలీసుల పహారాలో బస్తాలను తీసుకెళ్తున్న రైతులు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

ఒక్కో రైతుకు రెండు బస్తాలు పంపిణీ

ఏటూరునాగారం: యూరియా కోసం రైతులు పడిగాపులు పడ్డారు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా బస్తాలను కొనుగోలు చేసేందుకు రైతులు గురువారం ఉదయం నుంచి బారులుదీరారు. ఒక్కో రైతు ఆధార్ కార్డుపై రెండు యూరియా బస్తాలు ఇవ్వడంతో అవసరం ఉన్న రైతులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్‌లు సిబ్బందితో కలిసి బందోబస్తు చేపట్టారు. సుమారు 200 మంది రైతులు బస్తాలు క్యూలో నిలబడ్డారు. అయితే రైతుల మాత్రం తమకు రెండు బస్తాలు సరిపోవని ఎక్కువ ఇవ్వాలని అధికారులను కోరారు. నిబంధనల ప్రకారం రెండు బస్తాలు మాత్రమే ఇచ్చే అనుమతి ఉందని ఏఓ వేణుగోపాల్ తెలిపారు. ఈ బస్తాలను చిన్నబోయినపల్లితో పాటు షాపెల్లి, గోగుపల్లి, శివాపురం, పెద్ద వెంకటాపురం, కొండాయి, దొడ్ల, మల్యాల తదితర గ్రామాల రైతులకు మాత్రమే అందజేశారు.

యూరియా అమ్మకాల పరిశీలన

వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక సహకార సంఘంలో నిర్వహిస్తున్న యూరియా అమ్మకాలను ఏటూరునాగారం ఏడీఏ అవినాష్ వర్మ, ఏఓ ముంజ మహేష్ గురువారం పరిశీలించారు. వాజేడు సహకార సంఘానికి 579 బస్తాల యూరియా గురువారం వచ్చింది. యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో ఏడీఏ అవినాష్‌వర్మ, ఏవో మంజు మహేశ్, ఏఈఓ జాఫర్ దగ్గర ఉండి రైతులకు ఇబ్బందులు లేకుండా బస్తాల పంపిణీ జరిగేలా చూశారు.



వాజేడు: యూరియా విక్రయాలను పరిశీలిస్తున్న అధికారులు

శాంతినగర్‌లో అటవీశాఖ అధికారులు కూల్చిన గుడిసె



గొత్తికోయగూడెంపై దాడి

గిరిజనులపై దాడి, గుడిసెలు కూల్చేసిన అటవీశాఖ అధికారులు

మంగపేట: మండల పరిధిలోని సంద్రోనిఒర్రె అటవీ ప్రాంతం సమీపంలోని శాంతినగర్ గొత్తికోయగూడెంపై మంగపేట అటవీశాఖ రేంజ్ అధికారి అశోక్ ఆధ్వర్యంలో దాడి జరిగింది.

ఈ ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే..అటవీ ప్రాంతంలోని శాంతినగర్‌లో పదేళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన సుమారు 15 పైగా గొత్తికోయ గిరిజన కుటుంబాలు గుడిసెలు వేసుకున్నాయి. పోడు చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం అటవీశాఖ అధికారులు ఒక్కసారిగా గూడెంపై దాడికి దిగి తొమ్మిదికి పైగా గుడిసెలను కూల్చివేసి అడ్డువచ్చిన అమాయక గొత్తికోయ గిరిజనులపై దాడి చేసి గాయపరిచినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ విషయంపై అటవీశాఖ రేంజ్ అధికారి అశోక్‌ను వివరణ కోరగా మంగపేట బీటు పరిధిలోని అటవీప్రాంతంలో శాంతినగర్‌లో కొత్తగా పోడుచేసి అటవీ ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా 20 రోజుల క్రితం స్థానిక పోలీసులతో కలిసి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఉండాలని కొత్తగా పోడు చేయొద్దని, గుడిసెలు వేయవద్దని హెచ్చరించామని వివరించారు. అయినప్పటికీ వినిపించుకోకుండా నూతనంగా గుడిసెలు వేసినట్లు తెలిసిందన్నారు. దీంతో సాయంత్రం 3 గుడిసెలను తొలిగించినట్లు వివరించారు.



అటవీశాఖ అధికారులు గుడిసెలను కూల్చడంతో నిరాశ్రయులైన కుటుంబం

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్

ఏటూరునాగారం/మంగపేట: మీ సేవ కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ అన్నారు. ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని మీసేవ కేంద్రాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. అతిత్వరలో ఏటూరునాగారంలో నూతన ఆధార్ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. మంగపేట మండలంలోని పలు మీ సేవ కేంద్రాలను తహసీల్దార్ రవీందర్, ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్‌లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. మీ సేవ కేంద్రాల నిర్వహకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాలని సూచించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడి నుంచి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజన్ చార్టర్, భూ భారతికి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, తహసీల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల ఫోన్ నంబర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్, మీసేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలోని మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దేవేందర్

వైకల్యంతో పుట్టిన పిల్లలను గుర్తించాలి

డీఎంహెచ్ఓ గోపాల్‌రావు

ములుగు: వైకల్యంతో పుట్టిన పిల్లలను గుర్తించి సామాజిక ఆరోగ్య కేంద్రాలకు సిఫారసు చేయాలని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో రాష్ట్రీయ బాలికల స్వస్థత కార్యక్రమంపై గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర రక్తహీనత గల పిల్లలను గుర్తించి సామాజిక ఆరోగ్య కేంద్రం ఏటూరునాగారం, ములుగు ప్రభుత్వ ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేయాలన్నారు. రోజు వారిగా స్క్రీనింగ్ వివరాలను ఆర్‌బీఎస్కే పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ నెలలో పాఠశాలలను సందర్శించి వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు రణధీర్, పవన్ కుమార్, నరహరి, శ్రీనివాస్, మల్లిఖార్జున్, జయప్రద, డెమో సపంత్, కోఆర్డినేటర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు

తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు ఫైవ్ స్టార్ అవార్డు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌కు జాతీయస్థాయిలో ఫైవ్‌స్టార్ అవార్డు దక్కింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయిలో ఓపెన్ కాస్ట్ భూగర్భ గనుల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గనులకు కేంద్ర బొగ్గు మంత్రి శాఖ ఆధ్వర్యంలో స్టార్ రేటింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌ను సందర్శించిన నిపుణుల కమిటీ గనుల నిర్వహణ, పర్యావరణ, నూతన సాంకేతికత, ఆర్థికాభివద్ధి, పునరావాసం, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ రంగాలపై నిపుణుల కమిటీ రికార్డులు పరిశీలించి నివేదించారు. ఈ నేపథ్యంలో తాడిచర్ల మైన్‌కు జాతీయస్థాయిలో ఫైవ్ స్టార్ అవార్డు దక్కింది. ఈ అవార్డును కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డి, సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే చేతుల మీదుగా జెన్‌కో డైరెక్టర్ బి.నాగ్య ఈ అవార్డును అందుకున్నారు. ఆయన వెంట జెన్‌కో సీఈ జీవకుమార్, జీఎం మోహన్‌రావు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక


ములుగు రూరల్: జిల్లాలోని 10 మండలాల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 33 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం డీఈఓ కార్యాలయం నుంచి వివరాలు వెల్లడించారు. పీజీ హెచ్‌ఎంలు ఐదుగురు ఉండగా గోవిందరావుపేట పాఠశాలకు చెందిన గొంది దివాకర, వాజేడు నుంచి వెంకటేశ్వర్‌రావు, ములుగు మండలం పత్తిపల్లి పాఠశాలకు చెందిన ప్రేమలత, గోవిందరావుపేట సోమరెడ్డి, వెంకటాపురం(ఎం) మండలం నల్లగుంట పాఠశాలకు చెందిన భాగ్యలక్ష్మి ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు 14 ఉండగా వీరిలో ములుగు నుంచి ఎండీ హమీద్, ప్రభావతి, గోవిందరావుపేట నుంచి హట్కర్ సమ్మయ్య, తాడ్వాయి పాఠశాలకు చెందిన పోరిక శంకర్, ఏటూరునాగారం శ్రవన్‌కుమార్, సత్యం, కన్నాయిగూడెం నుంచి పాపయ్య, మంగపేటకు చెందిన క్రాంతి, నర్సింగరావు, నాగమ్మ, వాజేడు నుంచి శ్రీకాంత్, వెంకటాపురం పాఠశాలకు చెందిన శ్రీనివాస్, ఓదెలు, వెంకటాపురం(కె) నుంచి జయరాం ఉన్నారు. అలాగే సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఏడుగురు ఎంపిక కాగా ములుగు పాఠశాల నుంచి దిలీప్, ఏటూరునాగారం వెంకటేశ్వర్లు, గోవిందరావుపేట వెంకటేశ్, కన్నాయిగూడెం సరస్వతీ, మంగపేట రాజు, వెంకటాపురం(ఎం) రజిత, వెంకటాపురం(కె) నుంచి రామరావు ఉన్నారు అలాగే కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్/ ఎస్ఏలు ముగ్గురు ఎంపిక కాగా ములుగు నుంచి భారతి, వెంకటాపురం(ఎం) జయవసంత లక్ష్మీ, వెంకటాపురం(కె) ప్రమీల, పీజీటీ/ టీజీటీ నుంచి నలుగురు ఎంపిక కాగా అందులో ములుగు నుంచి కుమారస్వామి, గోవిందరావుపేట హరిక, వెంకటాపురం(ఎం) రాజేంద్ర ప్రసాద్, వెంకటాపురం(కె) మంజుల ఉన్నారు.



గురుభ్యోనమః

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

- ప్రభుత్వ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న టీచర్లు
- నాణ్యతగా, వినూత్నంగా బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు



పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. నాణ్యత, వినూత్నంగా బోధిస్తేనే విద్యార్థులకు అర్థమవుతుంది. అప్పుడే వారు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. మంచి ఉపాధ్యాయులుగా దేశ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ఈ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి కొందరు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తూ వెలుగులు నింపుతున్నారు. ఈ క్రమంలో నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలా బోధిస్తున్న పలువురు ఉపాధ్యాయులపై 'సాక్షి' స్ఫూర్తిదాయక కథనాలు.

సులభ గణితం.. ఆ సార్ స్పెషాలిటీ


విద్యార్థులకు గణితంలో సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్

జనగామ రూరల్: ఈ ఫొటోలో విద్యార్థులతో కనిపిస్తున్న ఉపాధ్యాయుడి పేరు అల్లూరి రవీందర్. జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. పాఠశాల స్థాయిలో పిల్లలకు గణితం అంటే భయం. వారిలో ఆ భయాన్ని తొలగిస్తేనే ఆ శాస్త్రం నేర్చుకోవడానికి ఆసక్తి కనబర్చుతారు. దీనిని గమనించిన టీచర్ రవీందర్.. 12 సంవత్సరాల నుంచి గణితం సులువుగా అర్థమయ్యేందుకు ఆ శాస్త్ర నమూనాలు తయారు చేసి బోధిస్తున్నారు. బట్టీపట్టే విధానం కాకుండా కృత్యాధార పద్ధతిలో గణితం బోధించడం ఆయన ప్రత్యేకత. 200కి పైగా గణిత మోడల్స్ తయారు చేసి బోధన సమయంలో ఉపయోగిస్తున్నానని రవీందర్ చెబుతున్నారు. కాగా, బెంగళూరు, చెన్నైలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో రవీందర్ రెండు సార్లు బహుమతులు గెలుచుకున్నారు.

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయుడు


వ్యాన్‌లో పాఠశాలకు విద్యార్థులను తీసుకొస్తున్న ఉపాధ్యాయుడు

గూడూరు: అతనో మారుమూల ఏజెన్సీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. ఎక్కడ పనిచేసినా విద్యాభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తారు. అతనే గూడూరు మండలం రాజనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి. యాకూబ్. పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచాలనుకున్న సహచర ఉపాధ్యాయుల నిర్ణయానికి యాకూబ్ తన అభిప్రాయం తెలిపారు. తాను సొంత డబ్బులు రూ. లక్షా 50 వేలు వెచ్చించి ఓ వ్యాన్ కొనుగోలు చేశారు. అంతేకాకుండా విద్యార్థులను రోజూ పాఠశాలకు తీసుకొచ్చి సాయంత్రం ఇంటి వద్ద చేర్చుతూ తానే వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దీంతో గతంలో ఆ పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, వ్యాన్ కొనుగోలు తర్వాత ఆ సంఖ్య 75కి పెరిగింది. కాగా, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుడే డ్రైవర్‌గా మారడంపై ఉన్నతాధికారులు గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రులను ఒప్పించి.. విద్యార్థుల సంఖ్య పెంచి


గంగాధర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వేముల గంగాధర్ విద్యార్థుల సంఖ్య పెంచారు. నెక్కొండ ప్రాథమిక పాఠశాల నుంచి గతేడాది బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించారు. మెరుగైన బోధన చేస్తామని, ఒక సంవత్సరం అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. ఇలా విద్యార్థుల సంఖ్య 10 నుంచి 36 వరకు పెంచారు. అదే విధంగా 10 మంది ఐదేళ్ల చిన్నారులు కూడా ప్రీప్రైమరీ స్కూల్‌కు వచ్చే విధంగా ఆయన కృషిచేశారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఐడెంటిటీ కార్డులు, టైలు, బెల్టులు అందించారు. ఇక తమ గ్రామ ఉన్నత పాఠశాలకు బేస్ గట్టిగా ఏర్పడింది. మరో ఐదేళ్ల పాటు బడి బతుకుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యార్థులతో ఫిజికల్ సైన్స్ టీచర్ రాజేందర్ అద్భుతాలు..


వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్.. విద్యార్థులతో అద్భుతాలు చేసి జూన్ 29న వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలపై నిర్వహించిన దశవధానంపై చేసిన అంశం ఆకట్టుకుంది. మరో 12 మంది విద్యార్థులు రసాయనశాస్త్రంలోని 118 మూలకాల పేర్లు 8 సెకన్ల వ్యవధిలో చదివారు. ఇందుకుగాను 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' చోటులో లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అక్షయ.. భౌతికశాస్త్రంలో ఒకేసారి పది మంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మధ్యలో ఇతర అంశాలతో మిళితంగా సమాధానాలు ఇవ్వడమేకాక, శాస్త్రవేత్తల పేర్లు, చిత్రాలను గుర్తుపెట్టుకొని అద్భుతంగా వివరించిన విధానం ఆకట్టుకుంది.

బడిని బాగు చేసి.. విద్యార్థులను తీర్చిదిద్ది


రాజేశ్


2018లో ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు టి.రాజేశ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నేడు హైదరాబాద్‌లోని శిల్పారామంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. రాజేశ్ బాధ్యతలు స్వీకరించిన సమయంలో స్కూల్‌లో జీరో స్టెంత్ ఉంది. దీంతో పాఠశాలను బాగుచేసి పిల్లలను బడిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2018లో జీరో స్టెంత్ స్కూల్‌ను రీఓపెన్ చేసి రూ.40 వేలు సొంత డబ్బులు వెచ్చించి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించారు. సహచార ఉపాధ్యాయుడు విజయ్‌భాస్కర్ సాయంతో ఇంటింటికీ తిరిగి 15మంది పిల్లలను బడిలోకి తీసుకొచ్చాడు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు. దీంతో 2023లో జిల్లా స్థాయిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయగా జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. జూలైలో ఢిల్లీలో జరిగిన సీసీఆర్‌టీ ట్రైనింగ్ ప్రోగ్రాంకు తెలంగాణ నుంచి 10 మంది వెళ్లగా అందులో రాజేశ్ ఉన్నారు.

నాలుగేళ్ల తర్వాత తెరుచుకున్న బడి..


విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ భిక్షపతి (ఫైల్)

శాయంపేట: మండలంలోని కొప్పులలో నాలుగేళ్ల క్రితం మూతబడిన గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను జూన్ 30న ఎంఈఓ భిక్షపతి తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వ విద్యను బతికించే ప్రయత్నం చేయడం అభినందనీయమని, విద్యే ప్రగతికి సోపానమని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలనే ఉద్దేశంతో ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తిరిగి తెరిపించారు. నాలుగేళ్లుగా మూతబడిన బడిని ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని తెరిపించినందుకు మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే సీఈఎల్ఈ రాథోర్
- కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ తనిఖీ


సీఈఎల్ఈ రాథోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే మజ్దూర్ యనియన్ నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) బి.పి.ఎస్.రాథోర్ అన్నారు. గురువారం సీఈఎల్ఈ షెడ్‌లో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం లోకోల నిర్వహణ పనితీరుపై విజయవాడ, లాలాగూడ, మౌలాలి, కాజీపేట డీజిల్‌షెడ్, ఎలక్ట్రిక్‌షెడ్ నుంచి పాల్గొన్న అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాగా, షెడ్ అభివృద్ధి, రైల్వే కార్మికుల సమస్యలను స్థానిక షెడ్ సీనియర్ డీఈఈ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

సీఈఎల్ఈకి నాయకుల వినతి

సీఈఎల్ఈ రాథోర్‌కు రైల్వే మజ్దూర్ యనియన్ కాజీపేట ఈఎల్ఎస్ బ్రాంచ్ నాయకులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. షెడ్‌లో లోకోల నిర్వహణకు సరిపడా స్టాఫ్ పెంచాలని, ఈఎల్ఎస్‌కు వచ్చే మార్గంలో రైల్వే ట్రాక్‌పై ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని, వెహికిల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలనే తదితర సమస్యలను వివరించారు. దీనిపై సీఈఎల్ఈ స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం, చైర్మన్ ఇబ్రహీం తెలిపారు. కార్యక్రమంలో ఈఎల్ఎస్ బ్రాంచ్ ట్రెజరర్ బి.రవీందర్‌రెడ్డి, ఆఫీస్ బేరర్స్ వైస్ చైర్మన్ ఎస్.గోపి, ప్రభాకర్, ఎస్.స్వర్ణకుమారి, అసిస్టెంట్ సెక్రటరీ పి.రాజు, అరుణ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

12న ఆర్టీసీల పరిరక్షణ దినం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

న్యూశాయంపేట: దేశంలోని 59 ఆర్టీసీ (రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్)లను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన చేపట్టనున్న ఆర్టీసీల పరిరక్షణ దినాన్ని(సేవ్ ఆర్టీసీ) విజయవంతం చేయాలని వరంగల్ రీజియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.ఎల్లయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీలకు సంబంధించి కొన్ని విలువైన భూములు ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని దాదాపు 59 ఆర్టీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం లేదని, ఫలితంగా ఆర్టీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీంతో కార్మికులు పని భారం పెరిగి అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. అందుకోసం ఈనెల 12న ఆర్టీసీల మనుగడ కోసం 'ఆర్టీసీల పరిరక్షణ దినం' (సేవ్ ఆర్టీసీ)డిమాండ్ డే పాటించాలని, ఆ రోజున కార్మికులందరూ నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. రీజియన్ కార్యదర్శి బి.ఉపేంద్రాచారి, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, పి.మహేందర్, కొమ్మాలు, ఎండి.పాషా, సాధిక్, రవి, సంపత్, శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

- వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ఉత్సాహంగా ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు


మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


పాల్గొన్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పరిపాలనభవనంలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 వసంతాల్లో ఫార్మసీ కాలేజీ స్ఫూర్తిదాయకమైన అధ్యాపకులు, విద్యార్థులను అందించిందని కొనియాడారు. ఫార్మసీలో ఇంకా మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు జరగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్ విశ్రాంత ఆచార్యులు పరమేశ్వర్ మాట్లాడుతూ ఫార్మసీ కాలేజీ ఎంతోమంది గొప్ప విద్యార్థులను అందించిందని గుర్తుచేశారు. యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జె. రాజమౌళి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా ఈ కళాశాలను నిలబెట్టుకున్నామన్నారు. కేయూ ఫార్మసీ అలుమ్ని వైస్ ప్రెసిడెంట్ ఏవీ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం పూర్వ విద్యార్థుల సంఘం పనిచేస్తుందన్నారు. ప్రొఫెసర్ రామ్‌బహూ మాట్లాడుతూ ఫార్మసీ రంగం ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. విశ్రాంత ఆచార్యులు ఎ.వి.ఎన్ అప్పారావు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు రుణపడి ఉంటామన్నారు. విశ్రాంత ఆచార్యులు మల్లారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులను చూసి గర్విస్తున్నామన్నారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు (అకుట్) బి. వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల చైర్మన్, ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి, కన్వీనర్ గాదెసమ్మయ్య మాట్లాడారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వన్నెతెచ్చిన ఫార్మసీ కాలేజీలో గొప్పపరిశోధనలకు అవకాశాలున్నాయన్నారు. ఆచార్యులు వై. నర్సింహారెడ్డి, ఎన్ ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం వెళ్తే బంగారం పోయింది..

- విశ్వనాథపురం సమీపంలో చైన్‌స్నాచింగ్
- మూడున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన దుండగుడు


వివరాలు సేకరిస్తున్న క్రైం విభాగం సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ మహిళ యూరియా తీసుకెళ్తుండగా చైన్‌స్నాచింగ్ జరిగింది. దుండగుడు ఆమె మెడలోనుంచి మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన మండలంలోని విశ్వనాథపురం సమీపంలో జరిగింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సముద్రాల శివారులోని నారాయణపురం గ్రామానికి చెందిన కత్తుల రాజమ్మ తన భర్త యాదగిరితో కలిసి గురువారం యూరియా కోసం స్టేషన్‌ఘన్‌పూర్ వచ్చింది. యూరియా తీసుకుని అదే రోజు సాయంత్రం దంపతులు టీవీఎస్ ఎక్స్ఎల్‌పై సముద్రాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ బైక్‌పై వారి వెనుక వచ్చిన దుండగుడు విశ్వనాథపురం సమీపంలో రాజమ్మ మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించాడు. ఈ ఘటనలో సదరు మహిళ ద్విచక్రవాహనంపై కింద పడి స్పృహ తప్పింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహలోకి వచ్చిన అనంతరం లబోదిబోమని రోదించింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. క్రైం విభాగం సీఐ రాఘవేందర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

యూరియా బస్తాలు మాయం

- పాగుళ్లపల్లి పీఏసీఎస్‌లో ఘటన


సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ: మండలంలోని పాగుళ్లపల్లి పీఏసీఎస్‌కు సరఫరా అయిన యూరియాలో 94 బస్తాలు మాయమయ్యాయి. ఏఓ ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు బుధవారం సాయంత్రం యూరియా పంపిణీ చేశారు. పంపిణీ నిలిపివేయాలనుకునే సమయానికి గోదాం వైపునకు రైతులు ఒక్కసారిగా పరుగులు తీశారు. దీంతో ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో తనిఖీ చేయకుండా గోదాం మూసివేశారు. మరుసటి రోజు వచ్చి లెక్క చూడగా సరికి 94 బస్తాల తేడా వచ్చింది. దీంతో సీసీ ఫుటేజీని పరిశీలించిన అధికారులు.. హమాలీలను విచారించగా 34 మంది తమ అవసరాలకు అనుగుణంగా తీసుకున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి రికవరీ చేసి పంపిణీ చేశారు. కాగా, యూరియా మాయంపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తాలు ఒక నాయకుడికి ఇచ్చి హమాలీలను కారణంగా చూపుతున్నారనే చర్చ సాగుతోంది.

చాక్లెట్ కొనుక్కొని వస్తూ మృత్యుఒడికి..

- లారీ ఢీకొని బాలుడి దుర్మరణం
- గోవిందరావుపేటలో ఘటన


హర్షసాయి(ఫైల్)

గోవిందరావుపేట: చాక్లెట్ కొనుక్కొని వస్తూ ఓ బాలుడు మృత్యుఒడికి చేరాడు. లారీ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోవిందరావుపేటకు చెందిన చెన్ను నర్సింహరావు తన ఇంటి నిర్మాణం కోసం ఇటుక ఆర్డర్ చేయడానికి వెళ్లే క్రమంలో తోడుగా మనువడు కొప్పనాతి హర్షసాయి (4)ని వెంట తీసుకెళ్లాడు. ఈ క్రమంలో హర్షసాయి కిరాణా షాపులో చాక్లెట్లు తీసుకుని రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో ఏటూరునాగారం నుంచి వరంగల్ వైపునకు వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నెల క్రితం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇదే ప్రదేశంలో అల్లే వెంకటేష్ (17) మృతి చెందాడు. ఈ ప్రాంతంలో తరచూ రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్టుకు గాయాలు


తీవ్ర గాయాలతో రబ్బాని పాషా

ధర్మసాగర్: రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్ట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్‌లో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రబ్బాని పాషా రాంపూర్ శివారులోని సాక్షి వరంగల్ యూనిట్ కార్యాలయంలో డెస్క్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో రాంపూర్ శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రబ్బాని పాషా ఆరోగ్యం విషమంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

గూడ్స్ షెడ్‌కు ఎరువుల రాక

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు గురువారం ఎరువులు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు 2లక్షల 35వేల యూరియా బస్తాలు చేరుకున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం వరంగల్ గూడ్స్ షెడ్‌కు చంబల్ కంపెనీ ఎంఓపీ(పొటాష్)1,079.400 మెట్రిక్ టన్నులు చేరుకోగా.. కోరమండల్ కంపెనీ చెందిన 28.28.0 రకం 483.300 మెట్రిక్ టన్నులు, 20,20,013 రకం 1,350.000 మెట్రిక్ టన్నుల ఎరువులు చేరుకున్నాయి. ఈ ఎరువులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారి రవీందర్ తెలిపారు.

దేవాలయ భూముల్లో భవనాలు ఖాళీ చేయాలి

- గోవిందరాజుల గుట్ట భూమి ఆక్రమణపై దేవాదాయ శాఖ నోటీసులు


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని చారిత్రక గోవిందరాజుల గుట్ట దేవాలయ భూముల ఆక్రమణలపై మల్లగుల్లాలు పడిన దేవాదాయశాఖ అధికారులు ఎట్టకేలకు కదిలారు. దేవాలయానికి చెందిన భూములపై పలుమార్లు సర్వే చేసిన అధికారులు.. రెండు రోజుల క్రితం వ్యాపార సంస్థలు, ఇళ్లవాసులకు నోటీసులు జారీ చేశారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 15/1, 15/2. 38లో సుమారు 8 ఎకరాలు ఉందని నిర్ధారించారు. అయితే సర్వేలో 5 ఎకరాల 25 గుంటలు మాత్రమే తేలింది. మిగతా స్థలంలో అక్రమంగా వ్యాపార సంస్థలు, నివాస గృహాలను నిర్మించుకున్నట్లు భావిస్తున్నారు. సుమారు 54 నిర్మాణాలుండగా, అందులో 15 వ్యాపార సంస్థలు, 39 నివాస గృహాలు ఉన్నాయి. వీరందరూ వ్యాపార సంస్థలు, నివాసాలను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేయగా, కొంత మంది స్వీకరించగా, మరికొందరు నిరాకరించారు.

సీపీఎం నేతలు, గృహ యజమానుల నిరసన

గోవిందరాజుల గుట్ట చుట్టూ ఉన్న నివాస గృహాలకు దేవాదాయ శాఖ అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీస్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆలయ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. 120 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి 54 కుటుంబాలకు అకస్మాత్తుగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి ఆందోళన గురి చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు బాబు, మాధవి, కుమార్, శివ, సంపత్, రమేశ్,యాదగిరి, రామ సరోజన, సదానందం, గోవర్ధన్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, LLB, B.Tech, ITI, డిప్లొమా, ఫార్మసీ, BAMS, MBBS, BPT, D.MLT, B.Ed, B.PEd అడ్మిషన్లకై సంప్ర: 99481 31154
[SCA 25007755]

REAL ESTATE

LEASE / SALE

■ హోటల్ (లీజ్/సేల్): హన్మకొండ మెయిన్ సెంటర్లో, మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్న హోటల్ లీజ్‌కి లేదా సేల్ చేయబడును. సెల్: 7569268606.
[SCA25007758]

TO-LET

■ WGL, ఓసిటీలో G+2 & Nspt మేన్‌రోడ్‌కి G+2 (5000 Sft) బిల్డింగ్స్ కిరాయికి ఇవ్వబడును. షాపింగ్ మాల్స్ & బ్యాంక్స్‌కి. Cell: 9959699386.
[SCA25007864]

PLOT FOR SALE

■ హన్మకొండ కిట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రక్కన, బస్వారెడ్డి టౌన్‌షిప్ 1st లైన్‌లో 530 Sq.Yds ఓపెన్ ప్లాట్ అమ్మబడును. సంప్ర. 99634 15800.
[SCA25007717]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ: 18K. Ph: 9640400073, 9160900024.
[SCA25007803]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.